దేవుడు మనమీద దయతలచి మధ్యలో తీసేయడు. లేకపోతే మనం ఎదగాల్సినంత బలంగా ఎదగలేం. దాంతో మనం ఆ సీతాకోక చిలుకలాగా ఎప్పటికీ ఎదగలేని ప్రమాదం ఉంటుంది.

అందుకే ఆ మనిషి తన తొందరపాటుతో ఆ సీతాకోకచిలుక గూడుని పాడుచేసి దాని ఎదుగుదలకి అడ్డు పడ్డట్లుగా, మనం ఎంత ప్రార్థించినా దేవుడు మనం కష్టాలని అనుభవించకుండా అడ్డుపడడు."

ఆ సమాధానంతో శిష్యుడి సందేహం పటాపంచలయింది.

## 51. బహుమతి

కాలేజీ చదువు ముగించుకుని ఇంటికి వస్తున్న ఒక యువకుడు రైలు ఎప్పుడు తమ ఊరి స్టేషన్‌లో ఆగుతుందా అని ఆత్రంగా ఎదురు చూడసాగాడు. ఎందుకంటే ఇండియాలో కొత్తగా వస్తున్న అనేక రకాల కార్లలో ఓ దానిమీద అతను మనసుపడ్డాడు.

చదువు ముగించుకుని ఇంటికి తిరిగివచ్చాక తనకో కొత్త కారు కొనివ్వమని కోరితే అందుకు అతని తండ్రి అంగీకరించాడు. స్టేషన్‌లో తన కోసం ఆ కొత్త కారు సిద్ధంగా ఉంటుందని ఆశించాడతను. తీరా రైలు దిగాక చూస్తే ఆ కారు లేదు. దాంతో డ్రయివర్ తెచ్చిన పాత కారెక్కి ఇంటికి చేరుకున్నాడతను.

తండ్రి తన కొడుకుని ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నాడు. ఆ రాత్రి భోజనాలయ్యాక కొడుకు కొత్త కారు గురించి తండ్రిని అడిగాడు. ఆయన వెంటనే ఓ అలమారు లోంచి గిఫ్ట్ రేప్ చేయబడ్డ ఓ చిన్న పేకెట్‌ని కొడుకు చేతిలో ఉంచాడు. అతను ఆత్రంగా దాన్ని విప్పి చూస్తే అందులో నీట్‌గా బైండ్ చేసిన భగవద్గీత పుస్తకం కనిపించింది. నిరాశ చెందిన ఆ కొడుకుకి తండ్రి మీద బాగా కోపం వచ్చింది.

అతను ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోయి తండ్రికి ఓ ఉత్తరం రాసాడు. అందులో 'నీ దగ్గర ఎంత ఐశ్వర్యం ఉన్నా నువ్వు నేను కోరింది ఇవ్వనప్పుడు నీ దగ్గర ఏదీ లేనట్లే అని నేను భావిస్తాను. నా దారి నేను చూసుకుంటాను. నీ నించి నాకు నయాపైస కూడా వద్దు. నేను స్వంత సంపాదనతో కారు కొనుక్కున్నాక గాని నిన్ను కలవను.' అని రాసి దాన్ని పోస్ట్ చేసాడు.

మళ్ళీ తండ్రిని కాంటాక్ట్ చేయలేదతను. ఓ వ్యాపారం మొదలుపెట్టి అందులో విజయం సాధించాడు. తను ముచ్చట పడ్డ కారుని కొనుక్కున్నాడు. తను కోరుకున్న యువతిని కూడా వివాహం చేసుకున్నాడు. చక్కటి పిల్లలు పుట్టారు. తన గొడవల్లోపడి తండ్రిని కలవడం విస్మరించాడతను.

ఓ రోజు తన తండ్రి మరణవార్త అతనికి తెలిసింది. తండ్రి లోభత్వమే గుర్తుండిపోయిన అతనికి ఆ వార్త ఎంతమాత్రం దుఃఖాన్ని కలిగించలేదు. ఇంటికి వెళ్ళాడు. అతను ఏడవకపోవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది.

తండ్రికి కర్మకాండ పూర్తిచేసాక ఓ రోజు అతను తండ్రి కాగితాలు చూస్తూంటే, వాటి మధ్య భద్రంగా దాచి ఉంచిన భగవద్గీత కనిపించింది. దాన్ని యధాలాపంగా అందుకుని పేజీలు తిరగేస్తూంటే, అందులో ఓ కవరు కనిపించింది. దానిమీద ఓ మోటార్ కారు డీలర్ చిరునామా ముద్రించి వుండటంతో దాన్ని ఆసక్తిగా విప్పి చూసాడు. అందులో ఓ కారు తాలూకు బిల్ వుంది. దానిమీద 'పెయిడ్ ఇన్ ఫుల్' అన్న ఆ డీలర్ రబ్బర్ స్టాంపు వేసి ఉంది. అతను తారీఖు చూస్తే అది తను ఇంట్లోంచి కోపంగా అలిగి వెళ్ళిపోయిన తేదీనే. ఆ కవర్లో తను ఇష్టపడ్డ కారు తాళంచెవి అతనికి కనిపించింది!

అంతే!!

అంతదాకా తండ్రి పోయినందుకు ఏడవని అతనికి దుఃఖం కట్టలు తెంచుకుని వచ్చింది. భోరున ఏడవసాగాడు.

నీతి: దేవుడు మనకిచ్చే బహుమతులని మనం ఎన్నోసార్లు, వాటి అంతరార్థాన్ని తెలుసుకోకుండా తిరస్కరిస్తూంటాం.

## 52. క్షమ విలువ

ఓ ఆధ్యాత్మిక గురువు తన శిష్యులని కొంతకాలం గమనించాక వారికో నీతిని బోధించదలచాడు.

ఓ రోజు వారినందరినీ పిలిచి చెప్పాడు.

“మీరు ఒకొక్కరూ ఎంతమందిని ద్వేషిస్తున్నారో అన్ని ఉడికిన బంగాళా దుంపలని వంటశాలలోకి వెళ్ళి తీసుకురండి.”

వాళ్ళంతా కొద్దిసేపట్లో బంగాళాదుంపలతో వచ్చారు. అందరికీ గురువుగారు తలో చేతి సంచీ ఇచ్చి చెప్పారు.

“మీ బంగాళాదుంపలన్నింటిని ఈ సంచీల్లో నింపుకోండి.”

కొందరు ఒకటి, కొందరు రెండు, మరికొందరు మూడు, ఇంకొందరు నాలుగు... ఇలా వాళ్ళంతా తాము తెచ్చిన బంగాళాదుంపలని తమకిచ్చిన ఆ సంచీల్లో నింపాక వారితో చెప్పాడు.

“మీరంతా ఓ వారంపాటు ఈ సంచీలని మీతోనే ఉంచుకోవాలి. అఖరికి మీరు బహిర్భూమికి వెళ్ళినా ఈ సంచీలని మీ వెంటే తీసుకెళ్ళాలి. వారం తర్వాత మళ్ళీ నాకు కనబడండి.”

ఆ ప్రకారం శిష్యులు ఆ సంచీలని ఎల్లప్పుడూ తమ వెంటే ఉంచుకోసాగారు. రోజులు గడిచేకొద్దీ ఆ సంచీల్లోంచి చెడువాసన రాసాగింది. అంతేకాక ఆ సంచీలు బరువుగా తోచసాగాయి. వారం ఎప్పుడు పూర్తవుతుందా అని భారంగా ఎదురుచూసిన ఆ శిష్యులు వారాంతంలో గురువుగారి దగ్గరకి వెళ్ళారు. అయన వాళ్ళవంక వాత్సల్యంగా చూస్తూ అడిగాడు.